క్లుప్తంగా

విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

అచ్చంపేట రూరల్: విశ్రాంత ఉద్యోగులు దీర్ఘ కాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. సోమవారం పట్టణంలోని సంఘం భవనంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శిగా చెన్నయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భాస్కర్, కుమారస్వామి, రామస్వామి, ఖాజామైనోద్దీన్, సురేందర్‌రెడ్డి, నర్సింహ్మయ్య, జంగిరెడ్డి, రాములు, శంకర్, మోహన్‌రెడ్డి, ముత్యాలు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

అచ్చంపేట రూరల్: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 14న జడ్చర్లలో మదాసి కురువ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను అచ్చంపేటలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆ సంఘం నాయకులు సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు వెంకటేష్ మాట్లాడుతూ మదాసి కురువ/ మదారి కురువ కులస్తులకు వెంటనే కుల పత్రాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వేణుగోపాల్, తిక్కన్న, పర్వతాలు, వెంకటేష్, శివ, విష్ణు, కృష్ణ, శ్రీనివాస్, లింగం, శివ, నిరంజన్, జగన్ పాల్గొన్నారు.

ఫొటో, వీడియో గ్రాఫర్లను ఆదుకోవాలి

మన్ననూర్: ప్రత్యేక తెలంగాణ సాధనలో ఫొటో, వీడియో గ్రాఫర్లు కీలక పాత్రను పోషించారని అసోసియేషన్ జిల్లా నాయకుడు రాజశేఖర్ ప్రభుత్వాన్ని కోరాడు. ఈ సందర్భంగా ఆయన సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలో జరుగుతున్న అన్యాయాలను ఫొటో, వీడియో ద్వారా చూపించి ప్రజలను చైతన్యం చేశామని గుర్తు చేశారు. నూతన టెక్నాలజీ అధునాతనమైన సెల్‌ఫోన్లు మార్కెట్‌లోకి రావడంతో ఫొటోగ్రాఫర్ల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. కుటుంబపోషణ భారంగా మారిందన్నారు. 90 శాతం సబ్సిడీతో బ్యాంకుల నుంచి రుణ సౌకర్యం కల్పించి ఆదుకోవాలన్నారు. అదే విధంగా 50 ఏళ్లు దాటిన పింఛన్ మంజూరు చేయాలని ఆయన కోరారు.

ఉపాధి కూలీకి గాయాలు

బిజినేపల్లి: మండలంలోని వట్టెంలో నల్ల మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌పై నుంచి కిందపడి ఉపాధి కూలీకి గాయాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కిష్టమ్మ ఉపాధి కూలీకి వెళ్లింది. పనుల్లో భాగంగా ట్రాక్టర్‌పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడింది. ఈ ప్రమాదంలో కాలు విరిగింది. సిబ్బంది గమనించి చికిత్స నిమిత్తం బాధితురాలిని నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

ఆలయ అభివృద్ధికి తోడ్పాటు

కల్వకుర్తిరూరల్: ఆలయ అభివృద్ధికి ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు సహకారం అందించారు. సోమవారం మండలంలోని ముకురాలలో చెన్నకేశవస్వామి ఆలయ నిర్మాణానికి 100 బస్తాల సిమెంట్‌ను ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డిరాఘవేందర్‌రెడ్డి సమకూర్చారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకులకు సభ్యులు సిమెంట్ సంచులను అందజేశారు. ప్రతాప్‌రెడ్డి, మల్లేష్, సతీష్, శ్రీను, వెంకటయ్య, శివకుమార్, కురుమయ్య, అంజి పాల్గొన్నారు.

అనుమతి లేకుండా అడవిలోకి వెళ్లొద్దు

మన్ననూర్: అటవీశాఖ అధికారుల అనుమతులు లేకుండా అడవి ప్రాంతంలోకి ఎవరు వెళ్లొద్దని ఎఫ్‌ఆర్‌ఓ ఈశ్వర్ పేర్కొన్నారు. సోమవారం అమ్రాబాద్ మండలం సార్లపల్లి గ్రామస్తులతో ఆయన సమావేశమయ్యారు. ఎవరైన అడవి ప్రాంతంలోకి ప్రవేశించాలంటే అటవీశాఖ అధికారులు, సిబ్బంది అనుమతులు తప్పని సరి అన్నారు. పశువులు, మేకలు, గొర్రెల కాపరులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో మాత్రమే మేపుకోవాలని సూచించారు. అడవిలో ఎవరైన నిప్పు పెట్టినా, వన్యప్రాణులను వేటాడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది మధుసూదన్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.


మొక్కులు చెల్లించుకున్న మాజీ ఎంపీపీ

కోడేరు: మంత్రి జూపల్లి కృష్ణారావు అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి రావాలని కురుమూర్తికి మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్‌రావు మొక్కుకున్నారు. ఈ మేరకు సోమవారం కురుమూర్తి స్వామి ఆలయానికి చేరుకొని మెట్టు మెట్టుకు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. అనంతర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సురేష్, పుట్టరాము, చామంతి రాజు, జేసీబీ తిరుపతయ్య పాల్గొన్నారు.

నాణ్యతగా నిర్మించాలి

పెద్దకొత్తపల్లి: సీసీ రోడ్లను నాణ్యతగా నిర్మించాలని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని మరికల్‌లో సీసీ రోడ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించాడు. ఈ సందర్భంగా ఆయన కాంట్రాక్టర్‌కు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జాతీయ ఉపాధిహామీ పథకం ద్వార మరికల్ గ్రామానికి రూ.33 లక్షలు మంజూరు అయ్యాయని ఆయన పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కోరారు. మాజీ సర్పంచ్‌లు సత్యం, చిన్నయ్య, అబీబ్ పాల్గొన్నారు.


వాటర్ ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న మల్లేశ్వరం గ్రామస్తులు



మంచాలకట్టలో పైపులైన్ ద్వారా బావిలోకి నీరు సరఫరా

తాగునీటికి తంటాలు

- పక్కనే కృష్ణానది ఉన్నా తప్పని తిప్పలు
- మిషన్ భగీరథ నీరు అంతంతే
- ఎండుతున్న బోరుబావులు


మల్లేశ్వరంలో వృథాగా ఉన్న వాటర్ ట్యాంక్


మల్లేశ్వరంలో నీటి కోసం వరుస క్రమంలో పెట్టిన బిందెలు



పెంట్లవెల్లి: వేసవికాలంలో రోజురోజుకు తాగునీటి సమస్య తీవ్రతరం అవుతోంది. మండలంలోని పలు గ్రామాల్లో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటి పోయాయి. తాగునీటికి పడరాని పాట్లు పడుతున్నారు. పక్కనే కృష్ణానది ఉన్నా నీరు లేక వట్టిపోయింది. నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలంలోని మంచాకట్ట, మల్లేశ్వరం, వేముకల్, జటప్రోల్‌లోని దోసకాయలపేట గ్రామాల్లో ప్రతి సంవత్సరం వేసవికాలంలో విపరీతమైన నీటి సమస్య తలెత్తుతోంది. శ్రీశైలం ప్రాజెక్ట్‌లో భాగంగా ఆ గ్రామాలు ముంపునకు గురయ్యాయి. దాదాపు 42 సంవత్సరాల నుంచి నీటి గోస తీరడం లేదు. ప్రతి యేట ఎన్నికల సమయంలో అధికారులకు, నాయకులకు ఎన్నో అర్జీలు ఇచ్చినా ఫలితం శూన్యం. ప్రస్తుతం నీటి సమస్యతో ఆయా గ్రామాల ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. గతేడాది వర్షాభావం కారణంగా భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోవడంతో ఉన్న చేతిపంపులు, బోర్లు, బావులు సైతం పూర్తిగా ఎండిపోయాయి. రైతుల పంట పొలాలలో వేసుకున్న బోర్ల నుంచి నీటి చుక్కరావడం లేదు. దీంతో పక్క గ్రామాల శివారు పొలాల నుంచి బోరుబావుల వద్ద మోటర్‌సైకిల్, సైకిల్ మీద నీటిని తెచ్చుకునే దుస్థితి నెలకొంది. మంచాలకట్ట, మల్లేశ్వరం గ్రామస్తులు చందాలు వేసుకొని బోర్లు డ్రిల్లింగ్ చేయించినా ఫలితం దక్కడం లేదు. మంచాలకట్టలో గత నెలలో 400 ఫీట్లు, 350 ఫీట్లు బోరు డ్రిల్లింగ్ చేయించిన చుక్కనీరు కూడ రాలేదు. మల్లేశ్వరంలో మూడు రోజుల నుంచి 300, 350 ఫీట్లు బోరు డ్రిల్లింగ్ చేయించిన అదే పరిస్థితి దాపురించింది. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. మల్లేశ్వరంలో నాయకులు, గ్రామపంచాయతీ అధికారులు వాటర్ ట్యాంకర్ల ద్వారా అరకొరగా నీటిని సరఫరా చేస్తున్నారు. కుటుంబానికి సరిపడ నీరు దొరకక నరకయాతన అనుభవిస్తున్నారు. మంచాలకట్టలో మాధవస్వామినగర్ గ్రామానికి చెందిన ఓ రైతు పొలం నుంచి పైపులైన్ ద్వారా బావిలోకి నీటిని నింపుకొని అక్కడి నుంచి గ్రామాలకు నీరు సరఫరా చేస్తున్నారు.

మిషన్ భగీరథ నీరు అంతంతే

వారానికి నాలుగు రోజులు మిషన్ భగీరథ నీరు సరఫరా చేస్తున్నారు. తరుచుగా పైపులైన్ పగులుతున్నా అధికారులు సమస్య పరిష్కారానికి కృషి చేయడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోయారు. నీరు సకాలంలో అందించడంలో విఫలం అవుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి ఎండాకాలంలో తాగు నీటి సమస్య ఉత్పన్నం అవుతున్న అధికారులు ఆ దిశగా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా గ్రామాల్లో అక్కడక్కడ ఉన్న చేతిపంపులను బాగుచేయించాలని పలువురు కోరుతున్నారు. మిషన్ భగీరథ నీరు వచ్చేలా అధికారులు, నాయకులు చర్యలు చేపట్టాలని ఆ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



ఎండాకాలంలో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మిషన్ భగీరథ నీరు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఉంది. పక్కనే కృష్ణానది ఉన్న తాగునీటికి తంటాలు పడుతున్నాం. కృష్ణానది నుంచి నీరు పైపులైన్ ద్వార గ్రామాలకు అందించాలి. – చిన్నమ్మ, మంచాలకట్ట

ప్రతి ఏడాది ఇంతే..



ప్రతి ఏడాది నీటి గోస తప్పడం లేదు. కృష్ణానది చెంతనే ఉన్నా ప్రతి ఏటా తాగునీటి సమస్య మాత్రం పెరుగుతూనే ఉంది. అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోవడం లేదు. అధికారులు, పాలకులకు సమస్య తెలిసినా పట్టించుకోవడం లేదు. వెంటనే సమస్య పరిష్కరించాలి. – ఈశ్వరమ్మ మల్లేశ్వరం

తాగునీటి ఎద్దడి రానీయొద్దు


మాట్లాడుతున్న ఎంపీపీ రాధ

ఊర్కొండ: గ్రామాల్లో తాగునీటి సమస్య రానీయొద్దని ఎంపీపీ బక్క రాధ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా మండలంలోని అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదిక చదివి సభకు వినిపించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకెళ్లారు. తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, విద్య సమస్యలను వివరించారు. సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ విధుల్లో అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. ఎప్పటికప్పుడు ఆయా శాఖల అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. వేసవికాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. అలాగే ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో సరైన వసతులు కల్పించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ విజయ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు ఖలీంపాషా, ఎంపీటీసీ సభ్యులు గోపాల్‌గుప్తా పాల్గొన్నారు.

కళాకారులకు ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న దాత మనోహర్

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని మారేపల్లిలో బ్రహ్మంగారి నాటకం ప్రదర్శించిన కళాకారులకు ఆ గ్రామానికి చెందిన మనోహర్ రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. కళలకు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. కళాకారులు నాటక ప్రదర్శనలో వివిధ పాత్రలతో ఆకట్టుకున్నారు. నాటకాన్ని తిలకించేందుకు గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

మల్లికార్జున నాటక ప్రదర్శన

చారకొండ: ఉగాది పండగ సందర్భంగా మండలంలోని జూపల్లి మల్లికార్జున స్వామి నాటక ప్రదర్శనను ప్రదర్శించారు. కళాకారులు వివిధ పాత్రలతో అలరించారు. మల్లికార్జున, భ్రమరాంబ కల్యాణ వేడుక అందరిని ఆకట్టుకుంది. పంతులు బాలస్వామి, రామచంద్రి, సుల్తాన్, అర్జున్, వెంకటయ్య గౌడ్, లింగం, జంగయ్య, కె. వెంకటయ్య, శ్రీను తదితరులు ఉన్నారు.

ఉగాది పచ్చడి తయారీపై అవగాహన



అచ్చంపేట రూరల్: మండలంలోని నడింపల్లి ప్రాథమిక పాఠశాలలో చిన్నారి విద్యార్థులు సోమవారం ఉగాది సంబరాలు నిర్వహించారు. క్రోధి నామ సంవత్సర ఉగాదికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు శ్రీశైలం విద్యార్థులకు ఉగాది పచ్చడి తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా చేసి వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉగాదికి ఆలయం ముస్తాబు

మన్ననూర్: ఉగాది పర్వదినం పురస్కరించుకొని స్థానిక వేణుగోపాల స్వామి ఆలయాన్ని సోమవారం ఆలయం గోపురాలు, పరిసరాలకు రంగులు వేశారు. ఆలయం పరిసరాలను నీటితో శుభ్రంగా కడిగి ముగ్గులు వేసి రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ పూజారి నర్సింహ్మ శాస్త్రీ ఆలయం ప్రాంగణంలో తెలుగు నూతన పంచాంగ పఠనం, పేరు బలాలు వివరిస్తారని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

ఉత్సాహంగా కవి సమ్మేళనం


మాడ్గుల నర్సింహ్మను సన్మానిస్తున్న గ్రామస్తులు

మన్ననూర్: స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన కవి సమ్మేళనం ఉత్సాహంగా కొనసాగింది. కవులు కవిత్వాలను వినిపించారు. ఉగాది పండుగ సందర్భంగా కవి మాడ్గుల నర్సింహ్మ ఆలపించిన కవిత్వానికి ప్రేక్షకులు మంత్ర ముగ్ధులయ్యారు. వెంకటరమణ, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, శివాజీ, బుచ్చయ్య, గోవింద్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మత పెద్దలకు సన్మానం

స్థానిక మసీద్ ప్రాంగణంలో ముస్లిం మత పెద్దలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ఉపవాస దీక్ష ఉన్నవారికి అల్పాహారంతో పాటు తోఫాలను అందజేశారు. కార్యక్రమంలో మసీద్ పెద్ద నసీర్ సాబ్, డాక్టర్ సైపుల్లాఖాన్ రషీద్, జాఫర్ ఉసేన్, అజ్మత్, అహమ్మద్, రహీం పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ: రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధిష్టానం ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలన్నారు. వర్షాభావ పరిస్థితి కారణంగా పంటలు పూర్తిగా ఎండిపోయాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలన్నారు. అదేవిధంగా రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరానికి రూ.15 వేల పెట్టుబడి సాయం అందించాలన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.2500 చెల్లించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించాలన్నారు. పాలనపై సీఎం రేవంత్‌రెడ్డికి పట్టు లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్‌ముదిరాజ్, నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, మధుసూదన్ రెడ్డి, నర్సింహ్మముదిరాజ్, ఆయా గ్రామాల నాయకులు తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏపీఓ చంద్రసిద్దార్థ

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా సాగుతున్న పనులను ఏపీఓ చంద్రసిద్దార్థ సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయ మాట్లాడుతూ గ్రామాల్లో చేపడుతున్న పనులపై ప్రతి కూలీకి అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఎండలు తీవ్రత కారణంగా పని ప్రదేశాల వద్ద తగిన వసతులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మధ్యాహ్నం 12 గంటలలోపు పనులు ముగించాలన్నారు. తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటలకు వరకు పనులు చేయాలని సూచించారు. పనుల నిర్మాణంపై క్షేత్ర సహాయకులు ఇచ్చిన సూచనలు, సలహాలను పాటించాలన్నారు.

వేతనాలు చెల్లించాలని ఎంపీడీఓకు వినతి


కోడేరు ఎంపీడీఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు


తెలకపల్లిలో..

కోడేరు: వేతనాలు చెల్లించాలని పంచాయతీ కార్మికులు సోమవారం ఎంపీడీఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కారోబార్ సాయిబాబు, మహేష్ మాట్లాడుతూ మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. అధికారులు వెంటనే స్పందించి పండగ పూట పస్తులు ఉండకుండా జీతాలు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో గురువారం నుంచి విధులను బహిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంక్షేమ సమితి మండల అధ్యక్షుడు బద్దుల రాజు, లక్ష్మయ్య, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని గ్రామ పంచాయతీ కార్మికుల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తుమ్మ మహేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల వేతనాల విషయంలో కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, బాలస్వామి, శివరాం, రవి తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లి: గ్రామ పంచాయతీ కార్మికులకు జీతాలు వెంటనే చెల్లించాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం పాలెం గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారికి బకాయిలు చెల్లించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బీరయ్య, సిబ్బంది స్వామిరెడ్డి, కృష్ణయ్య, కురుమయ్య, బుచ్చయ్య, కొండయ్య, శ్రీశైలం, రామేశ్వరమ్మ, బంగారమ్మ, అంజనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చెంచు మహిళలకు చీరలు పంపిణీ


చెంచు మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న డీఈ హేమలత

మన్ననూర్: తెలుగు సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కొమ్మెన్‌పెంట కుడిచింతలబైలు గ్రామాల చెంచు మహిళలకు మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అచ్చంపేట డివిజన్ డీఈ హేమలత సోమవారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ సుఖ సంతోషాలతో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా అన్ని ప్రాంతాల్లో కూడా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో భగీరథ సిబ్బంది ఏఈ మధు, సందీప్ ఉన్నారు.

కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేత


కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

వెల్దండ: జాతీయ ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలు వేసవిలో ఎండతీవ్రత నుంచి కాపాడుకోవడానికి జాగ్రతలను పాటించాలని ఇన్‌చార్జ్ ఏపీఓ ఈశ్వర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కంటోనిపల్లి, కుప్పగండ్ల, అజిలాపూర్, గుండాల, చెర్కూర్ తదితర గ్రామాల్లో కూలీలకు పీహెచ్‌సీ సిబ్బంది ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, టీఏలు ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు తదితరులు ఉన్నారు.

లింగాల: మండలంలోని అవుసలికుంట శివారులో ఉపాధి హామీ పథకం పనులు నిర్వహిస్తున్న కూలీలకు సోమవారం ఆశ కార్యకర్త వరలక్ష్మి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

అచ్చంపేటలో అరుదైన ఆపరేషన్

అచ్చంపేట రూరల్: నల్లమల ప్రాంతంలోని అచ్చంపేటలో మొదటిసారి అరుదైన మోకాళ్ల మార్పిడి ఆపరేషన్‌ను వైద్యులు చేశారు. పట్టణంలోని మహదేవ్ హాస్పిటల్‌లో సోమవారం డాక్టర్ మహేష్ బృందం విజయవంతంగా ఆపరేషన్ పూర్తి చేశారు. వివరాలు ఇలా.. మండలంలోని పల్కపల్లి గ్రామానికి చెందిన దుర్గయ్య కొంతకాలంగా తీవ్ర మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. మోకాళ్లు అరిగిపోయి నడవలేని స్థితికి చేరాడు. పలు ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించుకోగా సరైన వైద్యం లేక ఇబ్బంది పడ్డాడు. ఈ నెల 7న నొప్పి అధికమవడంతో పట్టణంలోని మహదేవ్ ఆస్పత్రిలో చేరాడు. వైద్యులు మహేష్, రాజు మోకాళ్ల నొప్పికి సంబంధించిన అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి ఆపరేషన్ చేస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. ఈ మేరకు సోమవారం వైద్యులు మహేష్, కార్తీక్, రాజు ఆర్థోపెడిక్ మోకాళ్ల మార్పిడి ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు.

ముస్లింలకు ఇఫ్తార్

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎంఎస్ఎన్ ఎక్సలెంట్ గ్రామర్ హైస్కూల్‌లో సోమవారం రాత్రి ముస్లింలకు వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ సీఎం రెడ్డి ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు మంత్రియానాయక్, ప్రతాప్‌రెడ్డి, ముస్లింలు ఇమామ్ హాఫీజ్‌గౌస్ అక్బర్ సిద్ధిఖ్, ఖాజామైనోద్దీన్, మన్సూర్, శ్రీనివాసరావు, నర్సింహారెడ్డి, రామనాథం, శేఖర్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చారకొండ: మండలంలోని గోకారం వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా, అక్రమంగా ట్రాక్టర్ ద్వారా ఇసుకను ఎర్రవల్లి తండాకు చెందిన నేనావత్ రాంపాల్ నాయక్ తరలిస్తున్నాడు. అందుకున్న సమాచారం మేరకు వాగు సమీపంలో ట్రాక్టర్‌ను పట్టుకునట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సీఎంను కలిసిన గిరిజన సంఘం నాయకులు


సీఎంను సన్మానిస్తున్న నాయకులు

వెల్దండ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మండలంలోని పోషమ్మగడ్డతండాకు చెందిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు వద్యావత్ సుశీల రాజ్, గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకుడు రాజేష్‌నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాదులో సీఎం నివాసంలో సోమవారం బడంగ్‌పేట గిరిజన సేవా సంఘం ఆధ్వర్యంలో సీఎంను గిరిజన సాంప్రదాయ కండువాలతో ఘనంగా సన్మానించారు. గిరిజన సంఘం భవనాలు, బంజారా భవన్ నిర్మించాలని కోరారు. అనంతరం వివిధ సమస్యలపై సీఎంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బడంగ్‌పేట గిరిజన సేవా సంఘం ఉపాధ్యక్షుడు బాజీసింగ్ చౌహన్, ప్రధాన కార్యదర్శి రామదాస్ నాయక్, సంయుక్త కార్యదర్శి రాములు, కోశాధికారి నాగేశ్వర్‌రావు, గోవర్ధన్‌నాయక్, ఇందల్‌ఫవర్, మంగబాబు, జ్యోతిబాబు, సుజాతబాయి తదితరులు ఉన్నారు.

అన్ని వర్గాలకు సేవలందిస్తాం

కల్వకుర్తిరూరల్: సమాజంలోని అన్ని వర్గాల వారికి సేవలు అందిస్తామని లయన్స్‌క్లబ్ పట్టణ అధ్యక్షుడు కల్మిచర్ల రమేష్ అన్నారు. సోమవారం మండలంలోని పజుగూల ప్రాథమికోన్నత పాఠశాలలలో 130 మంది విద్యార్థులకు ప్లేట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి శ్రీనివాస్, కిషన్, గణేష్, కృష్ణయ్య, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఉమాదేవి, ఉపాధ్యాయుడు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

లింగాల: మండలంలోని రాంపూర్ స్టేజీ దగ్గర సోమవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్‌లో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అనుమతి లేకుండా వాహనాలలో రూ.50 వేలకు మించి నగదును తీసుకెళ్లొద్దన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌సీ వెంకటయ్య, కిషన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.